క్లుప్తంగా

బకాయి చెల్లించనందునే ఆశీలు రద్దు

పొన్నూరు: మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్ ఆశీలు లీజుకు సంబంధించి మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించని కారణంగానే లీజు రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న పట్టణానికి చెందిన ఆశీలు లీజుదారుడు షేక్.గఫార్ అన్యాయంగా తన కాంట్రాక్టు రద్దు చేశారని ఆరోపించారు. సాక్షి పత్రికలో వచ్చిన వార్తకు కమిషనర్ వివరణ ఇచ్చారు.

పోలీస్ సిబ్బంది బదిలీ

పొన్నూరు: పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు పోలీసు సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. పట్టణ ఏఎస్ఐలు పి.వీరాంజనేయులు గుంటూరు నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు, పీఎం సుభాని, డి.శ్రీహరిరావు గుంటూరు ట్రాఫిక్‌కు, రూరల్ ఏఎస్ఐ ఎన్.కొండలరావు తాడికొండ పీఎస్‌కు, రూరల్ పీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు బి.జ్యోతి గుంటూరు ఉమెన్ పీఎస్‌కు, టి.శ్రీనివాసరావు పెదకాకానికి బదిలీ అయ్యారు.

లేమల్లెపాడులో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, దేవకీ వసుదేవుల వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణుని జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్, ఉపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, మోదుగుల రవికృష్ణ, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులో శ్రీ దుర్గా మల్లేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ముట్లూరు రోడ్డులోని మార్కెట్ సమీపంలో భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన అమ్మవారి దేవాలయంలో విగ్రహప్రతిష్ట కార్యక్రమం కనుల పండువగా జరిగింది. పసుపులేటి గిద్దయ్య, నారిశెట్టి కృష్ణ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జంధ్యాల వెంకట శివరామ శాస్త్రి ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఐదువేల మందికి అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల మేరకు పొన్నూరుకు చెందిన నటరాజ్ అనే వ్యక్తి మరో కొంతమందితో కలిసి కారులో సింగరాయకొండకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అంకిరెడ్డిపాలెం సమీపంలో ఎన్‌హెచ్–16 హైవేపై ఎదురుగా వెళ్తున్న లారీని క్రాస్ చేయబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు దాసరిపాలెం ప్లాట్లుకు చెందిన పోలా ఏసోబు, బట్టి గోపిపాల్ తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు కూడా పల్టీలు కొట్టి అప్రోచ్ రోడ్డుపై పడింది. కారులో డ్రైవర్‌తో కలిపి నలుగురు ప్రయాణిస్తుండగా ఎవ్వరికి ఎటువంటి గాయాలు కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొమ్మమూరు కాల్వలో యువకుడి మృతి



చేబ్రోలు: ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లిన యువకుడు కొమ్మమూరు చానల్‌లో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకారం దాచేపల్లి ప్రాంతానికి చెందిన పసుపులేటి సందీప్ (22) మంచాల గ్రామంలోని తాత అన్నదాసు రామకృష్ణ ఇంటిలో ఉంటూ గుంటూరులో చదువుతున్నాడు. గురువారం తెల్లవారుజామున సందీప్ ఇంటి వద్ద కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొమ్మమూరు చానల్ కట్ట మీద ద్విచక్ర వాహనం ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. ఉదయం కొమ్మమూరు కాల్వలో సందీప్ మృతదేహం లభించింది.మృతుని తాత రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.వెంకటకృష్ణ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రాత్రిళ్లు గస్తీ నిర్వహించాలి



మహిళా డాక్టర్లు, నర్సులు వైద్యశాలల్లో 24 గంటలు విధులు నిర్వహించే సమయంలో పోలీసులు పలు సమయాల్లో గస్తీ నిర్వహించాలి. వైద్యశాలల్లో ఎక్కువ సంఖ్యలో మహిళలే విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేసే సమయంలో వైద్యశాల వైపు కూడా రావాల్సి అవసరం ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్యశాలలు దూరంగా ఉండటం వల్ల భద్రత కల్పించాలి.

–షేక్. రేష్మా, వైద్యురాలు, సామాజిక ఆరోగ్య కేంద్రం. పొన్నూరు



రక్షణ లేకుంటే విధులు కష్టం

విధులు నిర్వర్తించే చోట భద్రత లేకుంటే చాలా కష్టం. పగలూ రాత్రి తేడా లేకుండా ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులు శ్రమిస్తుంటారు. అలాంటి వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకుంటే ఎలా? ప్రభుత్వాలు వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చాలా చోట్ల మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వర్తిస్తుంటారు. అలాంటి వారికి రక్షణ కల్పించాలి.

– మేరీ యునిస్, వైద్యాధికారి, పెదగొట్టిపాడు పీహెచ్‌సీ



గ్రామ స్వరాజ్యమంటూనే ఇష్టారాజ్యంగా..!

- ఒక గ్రామంలో రాజకీయ పార్టీ కార్యక్రమంలా
- మరో గ్రామంలో తూతూమంత్రంగా
- గ్రామ సభల వద్ద కనిపించని వసతులు
- పలు గ్రామాల్లో సర్పంచ్‌లు లేకుండానే..

ప్రత్తిపాడు: డిప్యూటీ సీఎం నుంచి మండల స్పెషలాఫీసర్ వరకు గ్రామ సభలపై ఎన్నో మాటలు చెప్పారు. గ్రామ స్వరాజ్యమంటూనే ఇష్టారాజ్యంగా గ్రామ సభలు జరిపారు. షామియానాలన్నారు.. పార్టీలకతీతమన్నారు.. ప్రత్యేకాధికారులన్నారు.. కానీ అవన్నీ పసలేని మాటలేనని తేలిపోయింది. గ్రామ సభల నిర్వహణపై అధికారులు అంతులేని అలసత్వాన్ని ప్రదర్శించారు. అడిగేది ఎవరులే.. అనుకున్నారో ఏమో మొక్కుబడి తంతుగా సభలను జరిపి, మమ అనిపించారు. కనీసం కుర్చీలు కూడా వెయ్యలేని దుస్థితిలో గ్రామ సభలను నిర్వహించి, చేతులు దులిపేసుకున్నారు అధికారులు.

పార్టీ కార్యక్రమంలా..



గ్రామసభ పూర్తిగా గ్రామ పంచాయతీకి, ప్రభుత్వానికి సంబంధించిన అంశం. కానీ అధికారులు మాత్రం కార్యక్రమాన్ని పూర్తిగా తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలా నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామ సభలో వేదిక తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గింజుపల్లి శివరాంప్రసాద్, పార్టీ ఎస్సీసెల్ నాయకుడు భాగ్యారావు, బీజేపీ నాయకుడు దారా అంబేడ్కర్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావుతో నిండిపోయింది. ఇది పార్టీ కార్యక్రమమా, ప్రభుత్వ కార్యక్రమమా అని ప్రజలు నోరెళ్లబెట్టారు.

నమ్మాలి.. ఇది గ్రామ సభే..!



ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూడండి. ఇది నిమ్మగడ్డవారిపాలెంలో పంచాయతీ కార్యాలయం ఎదురు జరుగుతున్న గ్రామ సభ. అధికారుల అలసత్వంతో కనీసం పంచాయతీ ఎదుట షామియానా కూడా వేయలేదు. ప్రజలు కూర్చునేందుకు సరిపడినన్ని కుర్చీలు కూడా సమకూర్చలేదు. సభకు వచ్చిన మహిళల్లో కొందరు ఇలా చెట్ల కింద, మరికొందరు మెట్లపైన కూర్చున్నారు. ఇదంతా గ్రామసభ ప్రత్యేకాధికారి సమక్షంలోనే జరిగింది. తిమ్మాపురం పంచాయతీలోనూ ఇదే పరిస్థితి.

ప్రత్యేక పోలీసు బలగాల మధ్య



గొట్టిపాడులో గ్రామ సభ పారా మిలటరీ బలగాల బందోబస్తు మధ్య జరిగింది. గ్రామంలో ఇప్పటికే అగ్ర వర్ణాలకు, దళితులకు మధ్య వివాదం నడుస్తుండటం, తాజాగా ఎస్ఎంసీ ఎన్నికల్లో కూడా తమకు అన్యాయం జరిగిందంటూ దళితులు ఆరోపిస్తుండటం, ఉప సర్పంచ్‌పై కొందరు చేయిచేసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తుగా జాగ్రత్తగా డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ప్రత్తిపాడు ఎస్ఐ, సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించాయి.

మూడేళ్ల బాలుడు సహా తల్లి అదృశ్యం



ప్రత్తిపాడు: మూడేళ్ల బాలుడు సహా తల్లి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని నడింపాలెం గ్రామానికి చెందిన దాసరి విజయ్, పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన దివ్యలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి పాప, మూడేళ్ల బాబు ఉన్నాడు. వీరు గత మూడేళ్లుగా ప్రత్తిపాడులో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న దివ్య తన మూడేళ్ల కొడుకుని తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త విజయ్ శుక్రవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

గుంటూరు రూరల్: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ట్రైనీ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ కోరారు. శుక్రవారం రూరల్ మండలం లాలుపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై జరిగిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారి వజ్రశ్రీ,, ఎంపీడీవో ఆది నారాయణ, గుంటూరు వెస్ట్ తహసీల్దారు ఫణీంద్ర, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఒ.శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

పొన్నూరు: ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై మండలంలోని 24 గ్రామాల్లో గ్రామ సభలను శుక్రవారం నిర్వహించారు. ఆరిమండ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సభలో ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రజా ప్రతినిధులు, ప్రజలతో చర్చించి ఆమోదం తీసుకోవాలన్నారు. తాళ్లపాలెంలో సర్పంచ్ చుండూరు వీరయ్య అధ్యక్షత వహించి, మాట్లాడారు.

కాకుమాను: జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరకూ ఉపాధి పనులకు వెళ్లాలని ఎంపీడీవో పి.రామకృష్ణ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన కొత్త పనులు, జాబ్ కార్డులు లేని వారిని గుర్తించాలని సూచించారు. సర్పంచ్ పసుపలేటి శివకుమారి, వైఎస్ సర్పంచ్ బోడపాటి ప్రసాద్, ఎంపీటీసీ పరమేశ్వరరావు, తహసీల్దార్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి పూర్ణయ్య పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు తీర్చటమే లక్ష్యం

చేబ్రోలు: మండలంలోని 13 గ్రామాల పరిధిలో మౌలిక సదుపాయాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తామని పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలులోని గ్రామ సచివాలయం-2 వద్ద శుక్రవారం గ్రామ సభ జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీలో మొదటి దశలో రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు పాల్గొన్నారు.

గ్రామసభలతో అభివృద్ధి ప్రణాళికలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ్



తిక్కిరెడ్డిపాలెంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ భార్గవ్‌తేజ్, ఎమ్మెల్యే

ప్రత్తిపాడు: అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు గ్రామసభలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ్ అన్నారు. తిక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథులుగా జేసీ భార్గవ్ తేజ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతర గేయాన్ని ఆలపించి గ్రామ సభను ప్రారంభించారు. సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ స్వయం సమృద్ధి దిశగా గ్రామాలను నడిపించే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి గ్రామ సభలు పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి, తహసీల్దారు కె. రవిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, సెక్రటరీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమిని మరువకండి

ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్



ఒప్పంద పత్రాన్ని విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, డాక్టర్ చంద్రశేఖర్

ప్రత్తిపాడు: యువతీ యువకులు విద్య, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లినప్పటికీ, మాతృభూమిని మరచిపోవద్దని ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు 21 రోజులుగా జరుగుతున్న ఇండక్షన్ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బుద్ధా చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, ఏఐసీటీఈ వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెన్ స్కూల్ డైరెక్టర్ కోగంటి శ్రీకాంత్, కళాశాల చైర్మన్ డా.మలినేని పెరుమాళ్లు కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గరుడ ఏరో స్పేస్‌తో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల చేసుకున్న అవగాహన ఒప్పంద పత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.అప్పారావు, పోపూరి రమేష్‌బాబు, ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌జేసీలో ఐటీబీఐ సెంటర్ సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్టీ కేంద్ర బృందం

గుంటూరు రూరల్: అంకుర పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధంగా ఉన్న యువతను ప్రోత్సహించేందుకు అన్ని వసతి సౌకర్యాలతో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలోని ఐటీబీఐ సెంటర్ సిద్ధంగా ఉండటం శుభ పరిణామమని సెంట్రల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ నవీన్ వశిష్ఠ పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలను కేంద్ర డీఎస్టీ బృందం సందర్శించింది. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంక్లూసివ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్ (ఐటీబీఐ) సెంటర్‌ను నిర్వహించటం సంతోషకరమన్నారు. కళాశాల విద్యార్థి బృందాల నూతన ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సెంటర్ల ద్వారా అంకుర పరిశ్రమల స్థాపనల దిశగా, నూతన ఆవిష్కరణలకు అవసరమైన అవగాహన సదస్సులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఇగ్నీషన్ గ్రాంట్ రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సమకూర్చడం జరుగుతుందన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రొఫెస్సర్ అశుతోష్ సక్సేనా, నరేంద్ర నేర్ల, ప్రొఫెస్సర్ రాధాకృష్ణ, ఆంధ్ర యూనివర్సిటీ హబ్ సీఈఓ రవి ఈశ్వరప్ప, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, సీఈఓ డాక్టర్ మహేంద్రవర్మ, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణ, పేదరిక నిర్మూలనే లక్ష్యం



పెదకాకాని: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు సద్వినియోగం చేసుకుని, గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఏపీ ఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. పెదకాకాని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామ సభకు డాక్టర్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప సర్పంచి వెలినేని మురళి అధ్యక్షత వహించారు. మోహన్‌రావు మాట్లాడుతూ వలసల నివారణ, పేదరిక నిర్మూలనకు గ్రామాలు అభివృద్ధి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 5,707 జాబ్ కార్డులు ఉన్నాయని డ్వామా ఏపీఎం బాలమ్మ వివరించారు. ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, పీఆర్ ఏఈ జగదీష్, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పంచాయితీ కార్యదర్శి ఎం.రాజారాం తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎంకే ఎంపీ విల్సన్ రాక

గుంటూరు రూరల్: బీపీ మండల్ జయంతి కార్యక్రమానికి ఆదివారం డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ గుంటూరుకు వస్తున్నారని బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అమరావతి రోడ్డులోని ఓ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్ రోడ్డు నందున్న బీపీ మండల్ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమంలో ఎంపీ పాల్గొని, నివాళులర్పిస్తారన్నారు. అనంతరం బండ్లమూడి గార్డెన్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగిస్తారని చెప్పారు. బీపీ మండల్ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకటసుబ్రమణ్యం, జనరల్ సెక్రటరీ డి.తిరుమలరావు తదితరులున్నారు.

జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రత్తిపాడు: విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని లైఫ్ స్కిల్స్, మోటివేషన్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ బిజయలక్ష్మి పరిమి అన్నారు. తుమ్మలపాలెం శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. బిజయలక్ష్మి విద్యార్థులకు కష్టపడటం, పట్టుదలతో ముందుకు సాగడం ద్వారా సత్ఫలితాలుంటాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.గోపీకృష్ణ, ఏవో సీహెచ్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ప్రత్తిపాడు: ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ 25వ పటాలం ఆర్మీ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్ కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాలలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఎన్‌సీసీ 25–ఏ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్ సీసీ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎన్ఎస్ఎస్ అధికారి సాగర్ పాటిల్, కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, ప్రిన్సిపల్ అప్పారావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో నేషనల్ స్పేస్ డే



గుంటూరు రూరల్: నేషనల్ స్పేస్ డేను విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రుడిపై అడుగు పెట్టిన దేశాల్లో భారత్ నాల్గవ స్థానంలో ఉందన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరుకోగలిగిన తొలి దేశంగా భారత కీర్తి గడించిందన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధన వైపు తమ ఆసక్తిని విస్తరించుకోవచ్చని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

- జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ
- ప్రత్తిపాడు హైస్కూల్, ఎల్‌ఈ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రత్తిపాడు ఎల్‌ఈ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శైలజ

ప్రత్తిపాడు: బడిఈడు పిల్లలంతా కచ్చితంగా బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ స్పష్టం చేశారు. ప్రత్తిపాడులోని ఎల్‌ఈ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలకు హాజరైన వారి వివరాలను హెచ్‌ఎం సదాశివరావును అడిగి తెలుసుకున్నారు. కొన్ని తరగతుల్లో నెల రోజులుగా కొందరు విద్యార్థులకు గైర్హాజరై ఉండటాన్ని డీఈవో గమనించారు. వాళ్లంతా సంచార జాతులకు చెందిన వారని, ఎలుకలు పట్టేందుకు కాకినాడ ప్రాంతం వెళతారని, మూడు నెలలకోసారి వస్తారని ఉపాధ్యాయులు వివరించారు. స్పందించిన డీఈవో అలా బడిఈడు పిల్లలను వదిలేస్తే ఎలాగన్నారు. వారి పూర్తి వివరాలను, కాకినాడలో వారు నివాసం ఉంటున్న చిరునామాలను తమకు తెలియజేయాలన్నారు. ఆ జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడి వారంతా అక్కడ పాఠశాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ఎంఈవోలు ఉండీ ఉపయోగం ఏమిటంటూ డీఈవో అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ పాఠశాల ముగిసిన తరువాత పదిహేను నిమిషాల పాటు పాఠశాలలోని విద్యార్థులందరినీ ఒక చోట కూర్చోబెట్టి ఎక్కాలు చదివించాలని ఆదేశించారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న బేస్‌లైన్ టెస్ట్‌ను డీఈవో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం తరగతి గదుల్లోనికి వెళ్లి పాఠ్యపుస్తకాలు చదివించి, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎల్ఈడీ స్క్రీన్‌లపై బోధిస్తున్న హిందీ పాఠ్యాంశాలను విద్యార్థులతో చదివించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జి. లీలారాణి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులున్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు

ప్రత్తిపాడు: నేషనల్ స్పేస్ డేలో భాగంగా గుంటూరు ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందు పవన్ దుర్గ, మణికంఠ సాయి, సోమనాథ్ ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వి.ఎస్. రామాంజనేయులుతో పాటు ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను డీఈవో, డీఎస్‌వో ప్రత్యేకంగా అభినందించారు. గతంలో ఇదే పాఠశాల విద్యార్థులు స్పేస్ వారోత్సవాల్లో పాల్గొని, ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: నేషనల్ స్పేస్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో గుంటూరులో జరిగిన స్పేస్ క్విజ్ పోటీలో నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం పొందినట్లు హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఎస్కే నశ్రీన్, బాల భవ్యశ్రీ , హారిక ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. డీఈఓ పి.శైలజ, జిల్లా సైన్స్ ఆఫీసర్ గౌస్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జయశంకర్ విజేతలను అభినందించి, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. సైన్స్ టీచర్ అరుణ కుమారి, గైడ్ టీచర్ దుర్గాబాయిని హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులు అభినందించారు.